కథ

# ఎవరేమనుకుంటారో!

పెయ్యేటి శ్రీదేవి

ఆ రోజు ఆదివారం. శ్రీనిధి భర్త రఘు పనిచేసే ఆఫీసులో అతడి కొలీగ్ కరుణాకర్ కూతురు మూడేళ్ల పాప బర్త్‌డే ఫంక్షన్ వుంది. ఫంక్షన్‌కి ఏ చీర కట్టుకోవాలో నిర్ణయించుకోలేక బీరువాలోని చీరలన్నీ మంచం మీద కుప్పలా పోసింది. ఎక్కడ ఏ ఫంక్షన్‌కి వెళ్లాలన్నా, చీర దగ్గర్నుంచి నగల వరకూ ఏదీ ధరించాలో నిర్ణయించుకోవడం చాలా కష్టమైన పని శ్రీనిధికి.

తను పట్టుచీర కట్టుకెళితే అందరూ మామూలు చీరలు కట్టుకొని సింపుల్‌గా తయారయి వస్తారు. తనని ఎగాదిగా చూస్తారు. అందరూ ఒక దారైతే తనొక్కత్తీ వేరుగా వున్నట్లు తెగ ఫీలయిపోతుంది. అలాగని తన మామూలు చీర కట్టుకెళితే అందరూ పట్టుచీరలు కట్టుకుని తయారవుతారు. అప్పుడు ఎగాదిగా చూస్తారు. ఇదేమిటి ఇలా తయారయింది అని! తను నగలు పెట్టుకుంటే అందరూ ఏమీ వేసుకోకుండా వస్తారు. అలాగని తనేమీ నగలు పెట్టుకోకుండా వెళితే అందరూ నగలు దిగేసుకొని వస్తారు. ఏమిటింత పెద్ద ఫంక్షన్‌కి ఇలా తయారయిందేమిటా? అని తనతో మాట్లాడుతూ మధ్య మధ్యలో ఎగాదిగా చూస్తూ వుంటారు.



అందుకే శ్రీనిధి నిదానంగా ఆలోచిస్తోంది. ఏయే ఫంక్షన్లకి ఎలాంటి ఫంక్షన్లకి అందరూ ఎలా తయారవుతున్నారో గుర్తు చేసుకుంది. సరే. ఇది బర్త్‌డే ఫంక్షన్ కదా అని పంజాబీ డ్రస్ వేసుకొని దగ్గరలో కొత్తగా పెట్టిన బ్యూటీ పార్లర్‌కి వెళ్లింది. తన పొడవాటి జుట్టుని చక్కగా జడ అల్లుకోకుండా, పార్టీకి వెళ్లే విధంగా తయారు చేయమని చెప్పి జుట్టంతా ఆ బ్యూటీషియన్ చేతిలో పెట్టేసరికి, ఇక దొరికిందే చాలని ఆ జుట్టునంతా దొరకపుచ్చుకొని, ఓ రెండు గంటలు అటు దువ్వి, ఇటు దువ్వి, పైనించి పాతిక రకాల సన్నని పాయలు తీసి, వాటితో సన్నని జడలు అల్లి, ఆ జడలన్నీ కింద జుట్టులో కలిపి, ఆ జుట్టుని మూడు భాగాలు చేసి, ఒక భాగం చుట్టు ముడి వేసి, మధ్య మధ్యలో పిన్నులు పెట్టి, మళ్లీ ఇంకో భాగం జుట్టుని చుట్టూ తిప్పి పిన్నులు పెట్టి, మళ్లీ మూడో భాగం జుట్టు చుట్టూ తిప్పి ముడి వేసి, పిన్నులు పెట్టి చివర మూడు భాగాలుగా జుట్టు కలిపేసి, మళ్లీ రెండుగా చేసి, ఒక భాగం జడలలాగ, రెండవ భాగం ఇంకో జడలాగ అల్లి, ఒక జడ ఒక వైపు, ఇంకో జడ రెండో వైపు చుట్టి చుట్టి, మళ్లీ ముప్పై పిన్నులు గుచ్చింది. చివరగా ఆ ముడికి నెట్ తగిలించి, నాలుగు తెల్లరాళ్ల పిన్నులు గుచ్చింది. అద్దంలో చూసుకుంటే తన మొహం తానే గుర్తు పట్టలేకుండా వుంది శ్రీనిధికి. ఉసూరుమంటూ పర్సులో వున్న రెండు అయిదు వందల నోట్లు, అక్షరాలా వెయ్యిరూపాయలూ ఆ బ్యూటీషియన్‌కి సమర్పించింది.

ఇంటికొచ్చేసరికి భర్త రఘు తన కోసమే ఎదురు చూస్తూ నిల్చున్నాడు. ఏమిటి నిధి? ఇంత లేటా? ఫంక్షన్‌కి టైమయిపోయింది. ఇంకా ఎంతసేపు? త్వరగా రా. ఏమిటి పైన తట్టలా ఆ ముడేమిటి? ఆ డ్రస్సేమిటి? ఎందుకింత ఘోరంగా తయారయ్యావు? అనేసరికి శ్రీనిధికి కళ్ల వెంబటి నీళ్లు గిర్రున తిరిగాయి. ఆ బుట్టనంతా విప్పేసి జడ అల్లేసుకుందామంటే, మళ్లీ ఆ సన్నని జడలన్నీ విప్పి, పొడవు జుట్టంతా విప్పేసరికి మూడు గంటలన్నా పడుతుంది. పైగా వెయ్యి రూపాయలు దాని మొహాన పోసి మరీ మేకప్ చేయించుకుంది. అంత పొడవాటి జుట్టు చిక్కు తీసుకుని జడ వేసుకునే ఓపిక లేక, ఏం చెయ్యాలా? అని ఆలోచనలో పడింది. పార్టీలో చాలా మంది జుట్టు కట్ చేసుకొని, విరబోసుకొని వస్తారు. అంత పొడవాటి జుట్టు తను విరబోసుకుంటే పూనకం వచ్చిన దానిలా, అమ్మశక్తిలా, ఏ కాళికాదేవిలాగానో అవుతుంది అందరికి! అందుకే ఇవాళ కొత్తగా తయారవాలని బ్యూటీపార్లర్‌కి వెళ్లింది. ఇంక ఆ తట్టముడి అలాగే వుంచేసుకొని, పంజాబీ డ్రస్ విప్పేసి, లైట్ పిస్తా కలర్ మీద గ్రీన్ బోర్డరున్న పోచంపల్లి పట్టుశారీకి బోర్డర్ కలరున్న బ్లౌజ్ వేసుకుని, అద్దం ముందు నించుని, ముందు నుంచీ, వెనక నుంచీ చూసుకొని సంతృప్తి చెంది, మొహానికి కాస్త పౌడరు పూసుకొని, బొట్టు సరిచేసుకొని, మెడలో కెంపురాళ్ల సన్నని నెక్లెస్ పెట్టుకొని బయటపడింది.

'అసలు నీ పొడవాటి జుట్టు చూసే నిన్ను పెళ్లి చేసుకున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటి ముడులెయ్యకు. అందరిలా జుట్టుకూడా కట్‌చేసుకోకు.' అంటూ స్కూటర్ స్టార్ట్ చేసాడు.

శ్రీనిధికి దానికేం సమాధానం చెప్పకుండా స్కూటర్ మీద కూర్చుంది. మధ్యలో పాపకి గిఫ్టు కొన్నారు. ఇద్దరూ ఫంక్షన్ హాలుకి చేరుకునేసరికి అప్పటికే పాప చేత కేకు కట్ చేయిస్తున్నారు. హాల్లో ఓ పక్క టివిలో 'పాడాలని ఉంది' ప్రోగ్రాం వస్తోంది. ప్రోగ్రాం మిస్ అవుతున్నందుకు బాధపడిన శ్రీనిధి ఇక్కడ చూద్దాంలే అనుకుంది. అందరికి పాప చేత కేక్ ఇప్పించారు.

'రా శ్రీనిధి! ఏమిటింత ఆలస్యంగా వచ్చారు?' అని పాప అమ్మమ్మ సరస్వతమ్మ అడిగింది.

'ఆ... ఏముంది? ఆ పొడవాటిజడ దువ్వుకొని, చిక్కు తీసుకొని, అల్లుకోడానికే చాలా సేపు పట్టివుంటుంది లెండి' అన్నది ఎప్పుడూ అసూయతో మండిపడే అనసూయమ్మ అన్న ఆవిడ. మళ్లీ శ్రీనిధిని తేరిపార చూసి, 'అయ్యో! ఈరోజు జడ వేసుకొని రాలేదా, శ్రీనిధి? ముడి వేసుకొచ్చావా? ఏమిటో, తట్టలా వుంది' అంది.

ఆవిడ అన్న మాటలకి శ్రీనిధి ఎంతో బాధ పడింది. ఆవిడ ఎప్పుడు ఫంక్షన్‌లో కలిసినా, శ్రీనిధి ఎలా తయారయినా, ఏదో విధంగా మనసు నొప్పించేలా కామెంట్స్ చెయ్యడమే ఆవిడ నైజం.

'నొప్పించక, తా నొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడ'ని సుమతీశతకంలో ఉంది.

శ్రీనిధికి ఎవరినీ నొప్పించే స్వభావం లేకపోయినా, తననే అందరూ ఎందుకు నొప్పిస్తారో అనుకుంది. ఆ విషయమే ఆలోచిస్తూ పక్కన వున్న తన ఫ్రెండు సౌమ్యని అడిగింది.

'సౌమ్యా! ఈ జుట్టు ముడి బాగాలేదా?'

'ఎందుకు బాగాలేదు? బానే వుంది' పొడిపొడిగా చెప్పింది సౌమ్య.

'ఎందుకు? అనసూయమ్మగారు నన్ను చూసి ఎప్పుడూ అదోలా మాట్లాడుతుంది?'

'దానికో పేరుంది. ఆవిడ పేరు అనసూయ అయితే 'న' తీసేస్తే ఆవిడ బుద్ధి పేరు అసూయ! ఆవిడలోని లేని అందాలన్నీ నీలో వున్నాయి. బ్రహ్మదేవుడు ఉదారబుద్ధితో ఆవిడకి విశాలమైన శరీరాకృతిని, పిసినారి తనంతో చిన్న చిట్టి కళ్లు, అదే పిసినారితనంతో నాలుగే వెంట్రుకలున్నట్లు చిన్న జుట్టు, ఆ జుట్టు రంగులో వున్న శరీరఛాయ వున్న అనసూయమ్మగారికి, నీకున్న పొడవాటి అందమైన జుట్టు, చక్రాల్లాంటి చారెడు కళ్లు, మరీ పిసినారితనంతో బ్రహ్మదేవుడు ఇచ్చిన ఉందా లేదా అన్నట్లు అనిపించే తీగలాంటి నీ సన్నని నడుము, బంగారు రంగు ఛాయలో మిలమిల మెరిసే శరీర ఛాయతో ఉన్న పుత్తడి బొమ్మలాంటి నీకు మరింత వన్నె తెచ్చే నీ నెమ్మది స్వభావం అనసూయమ్మగారికే కాదు. ఎవరికైనా అసూయ కలుగుతుంది. అందుకే ఆ మాటలేమీ నువ్వు పట్టించుకోకు. నువ్వు ఎలా తయారయిన అందంగా వుంటావు. ఎవరో ఏదో అనుకుంటున్నారనీ, నిన్నే ఎగాదిగా చూస్తున్నారని ఎక్కువగా బాధపడిపోకు. ఈ ఆధునిక ఫేషన్లకి లోనుకాకుండా, చక్కగా చీర కట్టుకుని, చేతులున్న జాకెట్టే వేసుకొని, ముడులూ అవీ కాకుండా, జుట్టు కత్తిరించుకొని విరబోసుకోకుండా, పొడవాటి జడ అల్లుకొని, కనకాంబరాల చెండు పెట్టుకుని, సన్నని కాటుక, ఎర్రటి బొట్టు పెట్టుకొని చేతుల నిండుగా గాజులు, మెడలో ఎర్ర కెంపుల లాకెట్‌తో వున్న నెక్లెస్ లాంటి చైను వేసుకొని తయారవుతావు చూడు, అసలే పొడవుగా వుండే నువ్వు కలహంసలా నడిచి వస్తుంటే నాకైతే...అబ్బా, నిన్ను వాటేసుకొని కొరుక్కుతినెయ్యాలనిపిస్తుంది. బహుశా అందరికీ అలాగే అనిపించి వుండాలి. అందుకేనేమో, అందరూ నిన్ను ఎగాదిగా చూసి అసూయపడుతూ వుంటారు.'

'ఛీ...ఫో..మరీ ఎక్కువగా చేసి మాట్లాడకు' శ్రీనిధి సిగ్గుపడింది.

సౌమ్య మాటలకి అంతదాకా బరువుగా వున్న శ్రీనిధి మనసు తేలికగా పక్షిలా గాలిలో విహరించి, ఉరకలు వేసింది.

'సరే... సరే... ఇప్పటికే లేటయింది. లంచ్ చేస్తున్నారు అందరూ. మనం కూడా తీసుకుందాం రా' అంది సౌమ్య.

బఫే కాబట్టి అందరూ గుంపులు గుంపులుగాచేరి, ఒకళ్లతో ఒకళ్లు కబుర్లు చెప్పుకుంటూ, ఎడమచేత్తో ప్లేటు పట్టుకొని, ఇంకో చేత్తో స్పూన్తో కలుపుకొని ఫేషన్‌గా తింటున్నారు. ప్లేటు ఖాళీ అయినప్పుడల్లా ఎవరికీ వాళ్లు ఎడమ చేతిలో వున్న ప్లేటుని కుడిచేతికిచ్చి, ఎడమచేతితో టేబులు మీదున్న పాత్రలలోని పదార్థాలను గరిటెలతో వడ్డించుకొని, మళ్లీ కుడిచేతిలోని ప్లేటును ఎడమచేతిలోకి మార్చుకొని, ఇంగ్లీషు భాషలో తెలుగు ముక్కలు కలుపుకుని, గలగలా మాట్లాడుతూ వారు మాట్లాడుతున్నది తెలుగో, ఇంగ్లీషో తెలియకుండా కబుర్లాడుకుంటూ, ఫేషన్ నవ్వులు నవ్వుతూ స్పూన్లతోనూ, ఫోర్కులతోనూ విందారగిస్తున్నారు. ఆ బఫే భోజనం చూసేసరికి మళ్లీ శ్రీనిధి మనసు భారంగా ఊయలలూగి వెనక్కి వెళ్లిపోయింది.

శ్రీనిధికి బఫే అలవాటు లేదు. చేతా కాదు. అస్సలిష్టం లేదు కూడా. చక్కగా డైనింగ్ టేబులు మీద ఇంట్లో కూచుని, చేత్తో భోజనం చెయ్యడమే ఇష్టం. పూర్వం అమ్మమ్మ, తాతగారి ఇంట్లో అయితే తాతగారు వెండిపువ్వులున్న పీట మీద కూర్చుని పెద్ద వెండి మరచెంబుతో మంచి నీళ్లు పెట్టుకుని, మధ్యలో బంగారపు పువ్వున్న వెండి కంచంలో , పూజ చేసి మడిగా వండిన పదార్థాలను నివేదన చేసి, ఆ తర్వాత భోంచేసి, ఆఫీసుకెళ్లేవారు. ఇంట్లో పిల్లలందరూ వాళ్ల పేర్లున్న వెండికంచాలలోనే భోంచేసేవారు.

భోజనం మధ్యలో లేవడం కానీ, అన్నం చేత్తో ఇంకోటి ముట్టుకోవడం గాని చెయ్యకూడదు. అప్పుడు అన్నాన్ని పరబ్రహ్మస్వరూపంగా భావించేవారు. వండిన వేడి వేడి అన్నం మాధవుడికి వేసి కబళంగా భావించి, అతిథికి పెట్టేవారు. కార్తీక మాసాలప్పుడు, ఏకాదశి రోజుల్లోనూ, తులసిపూజ చేసి, ఆ రోజంతా ఉపవాసముండి, ఆ మర్నాడు అతిథికి కడుపారా భోజనం పెట్టి, దక్షిణ పెట్టి తాంబూలం ఇచ్చేవారు. శుభకార్యాలొస్తే ఇళ్లల్లోనే పెరట్లోనే గాడిపొయ్యిలు తవ్వించి, వంటవాళ్లతో శుచిగా వంటలు చేయించి, వచ్చిన అతిథులకు అరిటాకుల్లో భోజనాలు వడ్డించేవారు. అప్పుడు పెద్దవాళ్లు పూజ, మడి ఆచారవ్యవహారాలు పాటిస్తూ, ఇంకా పురాణ కాలక్షేపాలు, బంధుమిత్రుల ఆప్యాయతలతో, సత్ప్రవర్తన, ధర్మచింతన కలిగి, ఒక పద్ధతి, క్రమశిక్షణతో వుండేవారు. ఎందుకంటే ఆ రోజుల్లో టీవిలు ఇప్పట్లా మితిమీరిన హింసతో వున్న సినిమాలు లేవు. ఆనాటి సినిమా పాటలు వింటూ వుంటే క్రూరమృగం కూడా హాయిగా నిద్రిస్తుందేమో. అవే నేటి పాటల తీరు వింటే, గంగిగోవు కూడా మృగంగా మారుతుంది. టివిలు, ఇంటర్నెట్‌లు, సెల్‌ఫోన్లు, ఇంకా ఎన్నో ఈ ఆధునిక ప్రపంచంలో మనం ఎంత దినదినాభివృద్ధి చెందుతున్నా, మనస్తత్వాలు మాత్రం బహుళ పక్ష చంద్రుడిలా క్షీణించిపోతున్నాయి. ఒకప్పుడు గుమ్మంలోకి ఆవు వస్తేనే, ఉన్నంతలో అన్నం పెట్టిన రోజునుంచి, నేడు సంపాదనలు ఎక్కువయినా పిల్లికి బిచ్చం పెట్టలేని స్థాయికి దిగజారాము.

'శ్రీనిధి! ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నావు? త్వరగా ప్లేటు తీసుకుని భోజనం వడ్డించుకో' అంది సౌమ్య తనూ వడ్డించుకుంటూ. 'ఇదిగో నువ్వేం సంకోచించకుండా నిర్భయంగా భోంచెయ్. నీ తాతముత్తాతల కాలం నాటి పద్ధతులన్నీ గుర్తు చేసుకోకు. మనం చాలా అభివృద్ధి చెంది, ఇంటర్నెట్ టెక్నాలజీ కాలంలో వున్నాం. అప్పటి వాళ్ల కన్నా మనం ఎన్నో రెట్లు అదృష్టవంతులం. పూర్వకాలం వాళ్లు పాపం, మనం అనుభవిస్తున్న ఆనందాలు అనుభవించ లేదు. కట్టెల పొయ్యిల మీద వంటలు చెయ్యడం దగ్గర్నుంచి వాళ్లు చాలా కష్టాలు పడ్డారు. నేడు మనకి ఎన్నో సౌకర్యాలు వచ్చాయి. ఎప్పుడూ పాతకాలం బామ్మలా ఆలోచించకు. కాలం ఎప్పుడూ ఒకలా వుండదు. అభివృద్ధితో పాటే మనుషులూ మారతారు' స్పూన్‌తో అన్నం తింటూ అంది సౌమ్య.

ఒక్క మాట కూడా ఏమీ చెప్పకుండానే తన మనసులోని ఆలోచనలని కనిపెట్టి, దానికి సమాధానంగా తనకి సర్దిచెబుతున్న సౌమ్య మేధావితనానికి శ్రీనిధి చాలా ఆశ్చర్యపోయింది.

మళ్లీమనసు తే లిక పరుచుకొని, శ్రీనిధి ప్లేటులో వడ్డించుకొని స్పూన్‌తో నెమ్మదిగా తినడం ప్రారంభించింది. టీవిలో వస్తున్న 'పాడాలని ఉంది' చూస్తూనే సౌమ్యమాటలు వింటోంది.

'చూడు శ్రీనిధి! నేనూ అందంగా వుంటాను. నాలోని ప్రతిభని చూసి నన్నందరూ ఇష్టపడతారు. కాని నువ్వు నా కన్నా చాలా రెట్లు అందంగా వుంటావు. ఆ అందానికి నీ మంచిమనసు తోడై, మరింత హుందాతనాన్ని స్తుంది. నువ్వు పరిపూర్ణ మహిళవు. స్టేజీ మీద నిండుగా బట్టలు వేసుకోకపో వడమే పద్ధతిగా అనుకొని, బికినీలతో వాళ్లు నడిచే నడకల దగ్గర్నుంచి, నడుం కొలతల దాకా లెక్కలు కట్టి, అందాల పోటీల్లో జడ్జిలు 'ప్రపంచ సుందరీమణి' అని కిరీటం పెడతారు! నువ్వా పోటీల్లో పాల్గొనాల్సిన ఖర్మ పట్టకుండా దేవుడే నీకు 'లోకసుందరి' కిరీటం పెట్టాడు! నీ భర్త ఏ పువ్వులతో పూజ చేసాడో, ఇంత సౌందర్యరాశివి దొరికావు. అలాగే నువ్వు కూడా పూజ చేసి వుంటావు కాబట్టి మన్మథుడు, యోగ్యుడు అయిన భర్త నీకు లభించాడు. దేనికి నువ్వు బాధ పడాలి? ప్రతి దానికీ ఎవరో ఏదో అనుకుంటారని సంకోచాలు పెట్టుకోకు. స్పూన్‌తో చేతకాకపోతే హాయిగా చేత్తోనే తృప్తిగా భోంచెయ్యి.'

మళ్లీ ఉలిక్కిపడింది శ్రీనిధి. స్పూన్‌తో నానా అవస్థ పడుతుండగా, అందరూ తనని చూసి ఎక్కడ నవ్వుతారో అని మొహమాటంగా స్పూన్‌తోనే తింటూ వుంటే, ఈ అవస్థనంతా గమనించి, తన ఆలోచనలని కనిపెట్టేసిన సౌమ్య టెలిపతీ విధానానికి మనసులోనే జోహారు లర్పించింది.

'ఏమిటి? ఏం మాట్లాడవు? అప్పుడే భోజనం అయిపోయిందా? సరిగ్గా తిన్నావా? పోనీలే. అక్కడ ఐస్‌క్రీం, గులాబ్ జాం, క్యారట్ హల్వా, ఫ్రూట్‌సలాడ్ వున్నాయి. అవన్నా తిను. చేత్తో తినడం కుదరదు కనుక అవి మాత్రం ఫోర్క్‌తోను, స్పూన్‌తోనూ తిన వచ్చు. ఎవరూ ఏమీ అనుకోరు. ఇంత పాతకాలం భావాలున్న దానివి, ఈ కాలంలో ఎలా పుట్టావే? అసలెవరికి పట్టిందే, నిన్నే తేరిపార చూడడానికి? ముందర నువ్వే వాళ్లని చూడకుండా నీకేం కావాలో తిను. అప్పుడు వాళ్లు నిన్నే చూస్తున్నారనీ, ఎవరో ఏదో అనుకుంటున్నారనే భావన నీకురాదు.'

మళ్లీ ఉలిక్కిపడింది శ్రీనిధి. ఈ సారి సౌమ్య మాటలకి కాదు. ఆరేళ్ల కుర్రాడు ఫోర్క్‌తో తింటూ, అది సరిగ్గా నోట్లోకి వెళ్లక మొరాయించి, ఆ పూరీ వచ్చి శ్రీనిధి పాదం మీద పడింది. ఫోర్క్ వచ్చి మడమకి గుచ్చుకుంది.

'అబ్బా! ఫోర్క్ ఎందుకిచ్చావే? పూరీ శుభ్రంగా చేత్తోనే తినొచ్చుగా?' అన్నాడు ఆ పిల్లాడి తండ్రి పక్కనే వున్న భార్యతో.

'అబ్బ, మీరూరుకోండి. పిల్లలకి నలుగురిలో వున్నప్పుడు కల్చర్ అలవాటు చెయ్యాలి' అంటూ మిగతా సగం పూరీ 'తినరా తిను' అంటూ వాడి నోట్లో కుక్కింది ఆ కల్చర్ తెలిసిన భార్య. వాళ్ల మాటలు విని శ్రీనిధి నవ్వుకుంది.

శ్రీనిధి అప్పుడు నోరు విప్పి చెప్పింది సౌమ్యకి సమాధానం.

'ఏం చెప్పనే సౌమ్య! ఒక పక్క 'పాడాలని ఉంది' చూస్తున్నాను. సాధారణంగా ఆ ప్రోగ్రాం నేనెప్పుడూ మిస్సవను. ఇక నువ్వు నా ఆలోచనలన్నీ కనిపెట్టేసి, నేనేమీ మాట్లాడకపోయినా నా భావాలకి అనుగుణంగా స్పందించి నువ్వు సమాధానపరుస్తున్నావు. నా మనస్సుతో మాట్లాడే, టెలిపతీ తెలిసున్న నీ అంత ప్రతిభావంతురాలు ఎక్కడా వుండదు. 'పాడాలని ఉంది'లో ఎవరికి ప్రైజు ఇస్తారో చూడనీ'


ఆకాశంలో గ్రహాలు ఎన్నివున్నా వెలుగునిచ్చేది సూర్యుడొక్కడే....,
లోకంలో మ్యారేజ్ బ్యూరోలు ఎన్నివున్నా పెళ్లి కుదిర్చేది "కాకతీయ" ఒక్కటే

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com

కార్యక్రమంలో చివరగా బాలసుబ్రహ్మణ్యం 'వారం వారం మనం మాట్లాడుకునే మాట' చెబుతున్నారు.

పెళ్లిళ్లకి, ఇంకా మిగతా ఫంక్షన్లలోనూ భోజనాల దగ్గర ఫోర్కులు, చెమ్చాలు పెడతారు. అసలు పూరీలు ఫోర్కుతో ఎలా తింటారండి? ఆ ఫోర్కుతో తింటే, సరిగా తినడం చేతకాక, పూరీలు ఎగిరి పక్కవాళ్ల మీద పడుతుంటాయి. అలాగే దోసెలూ స్పూన్లతో తింటారు. కుదరకపోతే ఎవరూ చూడకుండా చేతితో తుంపుకు తింటారు. చూసేవాళ్లు చూస్తూనే వుంటారు. ఫారిన్ కల్చర్ చూసి, ఫోర్కులు, చెంచాలు అలవాటు చేసుకుంటున్నారు. ఫారిన్ కంట్రీస్‌లో అంటే వాళ్లకెలాగూ తప్పదు. ఫోర్కులు, పుల్లలు అవసరమైతే కత్తులు, కటార్లు కూడా కావాలి. మనకెందుకండీ ఆ కల్చరు? చక్కగా చేతి అయిదు వేళ్లతో అన్నం కలుపుకొని తింటే ఎంత బాగుంటుంది? సరే. విన్నందుకు ధన్యవాదాలు'

ఇంతలో ప్రెజెవరికిచ్చారో తెలియకుండానే టివి ఛానెల్ మార్చేసారు.

'అందరికీ నమస్కారం. క్షమించాలి. ముందరే చెబుదామనుకున్నాను. హడావిడిలో మరిచిపోయాను. బాలసుబ్రహ్మణ్యంగారి మాటలు విని గుర్తొకొచ్చింది. ఫారిన్ కల్చర్ చూసి, ఎవరో ఏదో అనుకుంటారని స్పూను, ఫోర్క్‌తో తినక్కర్లేకుండా, చక్కగా మన పద్ధతిలో చేత్తో అన్నం కలుపుకొని హాయిగా, తృప్తిగా భోంచెయ్యండి. ఎందుకంటే, ఈ మధ్య నేను ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు మన భారతీయ హోటల్స్‌కి ఎక్కువ మంది ఆస్ట్రేలియన్లు వచ్చి ఇడ్లీ, దోసె, తింటూండడం చూసాను. కొంత దోసె ఫోర్కులతోనూ, చెంచాలతోనూ తింటూ, మిగిలింది చేత్తోనే తుంపుకుంటూ తింటున్నారు. వాళ్లు కూడా వేళ్లు నాక్కుంటూ తింటారు. మనం చేత్తో తింటుంటే చూసి వాళ్లు మనని ఎక్కడ హేళన చేస్తారో అని న్యూనతగా భావించి ఫోర్కులతోనూ, చెంచాలతోనూ తింటూ వాళ్ల కల్చర్‌ని అలవాటు చేసుకుంటున్నాము. వాళ్లు మన కల్చర్‌ని పాటిస్తుంటే, మనం మన కల్చర్‌ని వదిలి వాళ్ల కల్చర్‌ని ఎందుకు పాటించాలి? వాళ్లు తినే బ్రెడ్ ముక్కలకి, ఇంకా వాళ్లు తినే అనేక రకాల తిళ్లకి ఫోర్కులు, కత్తులు, స్పూన్‌లు ఇంకా పుల్లల కూడా అవసరమవుతాయి. మన భోజనానికి ఆ ఫోర్కులు అవసరం లేదు. కనక అందరూ మన కల్చర్‌లోనే తృప్తిగా భోంచెయ్యండి. నమస్కారం.' అని చెప్పారు పుట్టినరోజు జరుపుకుంటున్న పాప తాతగారు.

అప్పటికే భోజనం ముగించిన వాళ్లు మనసులో బాధగా అనుకున్నారు.

'ఇదేదో ముందరే చెప్పచ్చు కదయ్యా. కల్చరు మారిందని? చేత్తోనే తృప్తిగా భోంచేసేవాళ్లం.'

ఇంకా తినని వాళ్లు, తింటున్న వాళ్లు, ఫోర్కులు, చెంచాలు విసిరేసి చేతులతో అన్నం కలుపుకొని భోంచేసాక, స్పూన్లతో ఐస్‌క్రీం, గులాబ్‌జాం, కస్టర్డ్ తింటున్నారు. ఎందుకంటే వాటి కల్చర్ మారదు!

'ఒరేయ్! ఇంకో మూడు పూరీలు తినరా. అన్నం ఎలాగూ తినవు. పూరీలు ఇష్టమేగా. తిను. ఇంటికెళ్లాక మళ్లీ ఆకలంటూ నా ప్రాణాలు తింటావు.' అని ఆ పిల్లాడి తల్లి పూరీలిచ్చింది.

'మమ్మీ! ఫోర్కియ్యవే. నీకు కల్చరుండటల్లా.'

'ఏడిశావులే వెధవా! కల్చరు మారిపోయింది. ఛీ.. ఛీ.. ఫోర్కు పడెయ్యి. పూరీలు చక్కగా చేత్తో తిను. మన కల్చరుతో అయితే ఎన్ని పూరీలైనా త్వరగా తినేయ్యచ్చు.'

'మమ్మీ! ఇంక తినలేనే.'


'ఒరేయ్ కల్చరు లేని వెధవా! మమ్మీ కాదు. అమ్మా అని పిలు. బాలసుబ్రహ్మణ్యంగారు చెప్పినా వినవేం? కల్చరు నేర్చుకో.'

శ్రీనిధి వాళ్ల మాటలు వింటూ మనసులో పగలబడి నవ్వుకుంది.

'ఫరవాలేదు. ఎవరూ ఏమీ అనుకోరు. హాయిగా పైకి నవ్వేసెయ్యి' అంది సౌమ్య.

'ఓసి నీ టెలీపతి బుద్ధి బంగారం కాను! మరీ నా మనసులోకి దూరేసి, రహస్యాలన్నీ కనిపెట్టేసి, మనసుతో మాట్లాడెయ్యకే బాబూ!' అంటూ శ్రీనిధి పైకి పగలబడి నవ్వేసింది.

'అమ్మయ్య! ఇలా వుండు' అంది సౌమ్య.




శ్రీనిధి, ఇక వెడదాం రా. అంటూ బయటకు నడిచి స్కూటరు స్టార్ట్ చేసాడు రఘు.

అక్కడ ముగ్గురు బిచ్చగాళ్లు-ముసలి మొగుడు, పెళ్లాం, కూతురు- ఏమన్నా పెడతారేమోనని గంపెడాశతో కూర్చున్నారు. ఏమీ దొరక్క ఆకలి బాధతో నిరాశగా నిట్టూర్చి అనుకుంటున్నారు.

'ఏమిటో, అదివరకు భోజనాలు చేసి అరిటాకులు, విస్తరాకులలో వాళ్లు పారేసిన అన్నాలు తింటే కడుపు నిండిపోయేది. ఇప్పుడు వాళ్లు కూడా మనలాగే పళ్లాలు పట్టుకొని వడ్డింపించుకుంటారు. గుంపులు గుంపులుగా చేరి ఇంగ్లీషులో మాట్లాడుంటూ, ఫేషన్ నవ్వులు నవ్వుకుంటూ తింటారు. మధ్యలో ఎంగిలి చేత్తో వెళ్లి వాళ్లే వడ్డించుకుంటారు. ఆళ్లు సూపు తాగుతారు. మనం గంజి తాగుతాం. ఆళ్లు కట్ చేసిన ఎజిటబుల్స్‌ని సలాడు అనుకుంటూ ఫోర్కులతో గుచ్చి గుచ్చి తింటారు. మనమూ ఆకలేస్తే కూరముక్కలు చేత్తో పట్టుకుని పళ్లతో కొరుక్కు తింటాము.

ఆళ్ల ఒంట్లో రగతమే. మన ఒంటోది రగతమే. ఆళ్ల రగతమూ ఎర్రగా వుంటది. మన రగతమూ ఎర్రగానే వుంటది.

ఆళ్లకి ఆకలేస్తే అన్నం తింటారు. దాహమేస్తే నీరు తాగుతారు. మనమూ ఆకలేస్తే అన్నమే తింటాము. దాహమేస్తే నీరే తాగుతాము.

ఆళ్లు మడుసులే. మనమూ మడుసులమే. ఆళ్ల కల్చరూ, మన కల్చరూ ఒకటిగానే కనిపిస్తుందమ్మా నాకు. ఒక్కటే తేడా. ఆళ్లు గొప్పోళ్లు. మనం పేదోళ్లం అంటూ గొప్పవాళ్లు, పేదవాళ్ల తారతమ్యాలు కూతురు చెబుతుంటే, 'సరే సరి! సినిమా డైలాగులు మాట్లాడమోకు. ఆ గొప్పోళ్లు వింటే డబ్బులేసే పేదోళ్లందరూ. ఇట్టాగే నీతి వాక్యాలు మాట్లాడతారని చులకనగా చూస్తారు. రా పోదాం. ఎక్కడో అక్కడ. ఏ అమ్మో, ఓ అమ్మ కాసింత ముద్ద పెట్టకపోదు.'

వాళ్ల మాటలు వింటూ నుంచున్న శ్రీనిధి, బొట్టుపెట్టి ఇచ్చిన మామిడిపళ్లు, జాకెట్టుగుడ్డ, మర్నాడు తన బర్త్‌డేకని కొనుక్కున్న స్వీట్స్ పాకెట్టు వాళ్లకిచ్చేసింది. చీర, షర్టు వున్న పాకెట్టు కూడా వాళ్లకు ఇచ్చింది. ఎక్కడికన్నా వెళ్లేటప్పుడు పేదవాళ్లకివ్వడానికి పాత బట్టలు తీసిపెడుతూ వుంటుంది.

'ఎవరో ఈ కాలంలో పుట్టిన ఫేషను తెలీని పాతకాలం నాటి మంచమ్మలాగుండాదే! ఆ దేవతని బగమంతుడు నూరేళ్లు చల్లగా చూడాలి' అనుకున్నారు ఆ బిచ్చగాళ్లు.

'రా నిధి. వెళదాం. స్కూటర్ స్టార్టయింది' అన్నాడు రఘు.

ఆ అందమైన జంట స్కూటరు మీద వెడుతుంటే మిగతా అందరూ వాళ్లనే అసూయగా చూస్తున్నారు.

★